క్లుప్తంగా

ముగిసిన జాతరలు



భక్తులకు దర్శమిస్తున్న మారెమ్మ

సంబేపల్లె : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె సమీపంలో వెలసిన గెవిమాతమ్మ, పెద్దబిడికి పంచాయతీలో కొలువైన మారెమ్మ జాతరలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీబండ్లు ఆలయాల చుట్టూ ప్రదర్శనలు చేయించారు. సంతానం లేని వారు అమ్మవారి వద్ద వరపడ్డారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతరలో చాందినీబండ్ల ప్రదర్శన ఉత్సవాలకే తలమానికంగా నిలిచాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును కల్పించారు.

వైభవంగా గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నమండెం : బోరెడ్డిగారిపల్లెలో పాలేటమ్మ గ్రామోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా గ్రామోత్సవాన్ని బాజాభజంత్రీలు, మేళతాళాల మధ్య ఊరేగింపు సాగించారు. నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాలమ్మ తిరునాల



తిరునాలకు ముస్తాబైన అంకాలమ్మ ఆలయం

సిద్దవటం : మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో గురువారం నుంచి అంకాలమ్మ తిరునాల జరుగునని గ్రామ పెద్దలు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే తిరునాలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 11న సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామపెద్దలు కోరారు.

సబ్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు మార్పు

పెనగలూరు : మండలంలోని సబ్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు మార్పు చేసినట్లు ఏఈ షఫీ తెలిపారు. పెనగలూరు సబ్ స్టేషన్ ఫోన్ నెంబరు – 8712625855, తిమ్మాయిగారిపల్లి సబ్ స్టేషన్ నెంబరు – 8712625856, బెస్తపల్లి సబ్ స్టేషన్ నెంబరు – 8712625857, కొండూరు – 8712625858 నెంబర్లుగా మార్పు చేసినట్లు వారు తెలిపారు. పాత ఫోన్ నెంబర్లు ఇకపై అందుబాటులో ఉండవన్నారు. విద్యుత్ వలన ఏమైనా సమస్యలుంటే పై నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

చెట్ల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

గాలివీడు : రోడ్డుకు అడ్డుగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న చెట్లను, చెట్ల కొమ్మలను లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, పోలీస్‌సిబ్బందితో కలిసి బుధవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గోరాన్‌చెరువు, గొట్టివీడు గ్రామాల పరిధిలోని ప్రధాన రహదారికి అడ్డుగా ఉన్న వృక్షాలను, కొమ్మలను తొలగించినట్లు ఆయన తెలిపారు. మలుపులు ఉన్న ప్రాంతంలో చెట్ల రెమ్మలు దట్టంగా కమ్ముకోవడంతో అటుగా వస్తున్న వాహనాలు కానరాక ప్రమాదాల బారిన పడుతుండటంతో నివారణ చర్యలు తీసుకున్నామన్నారు.

ఆసుపత్రికి మందుల అందజేత



మందులను అందిస్తున్న దాత వినోద్‌కుమార్

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో బుధవారం సెవెన్ హిల్స్ మెడికల్ స్టోర్ అధినేత వినోద్‌కుమార్ సహకారంతో మండలంలోని ప్రభుత్వాస్పత్రికి గ్యాస్ ట్రబుల్‌కు సంబంధించిన సిరప్‌లను వైద్యాధికారి విజయ్‌కుమార్‌కు అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు లయన్ మహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్, వెంకట చలపతి, ఫార్మసిస్టు పార్వతి, స్టాఫ్ నర్స్ షంషాద్‌బేగం, అనూష తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటికి పొగబెట్టిన పచ్చపార్టీ !

- మాజీ మంత్రి బ్రహ్మయ్యని రాజకీయంగా సమాధి చేసింది చంద్రబాబే
- యువగళంకు బ్రహ్మయ్య వారసులు దూరం
- వారసులకు ఇచ్చిన మాట తప్పి వెన్నుపోటు పొడిచారంటున్న ఆ వర్గం నేతలు



పసుపులేటి బ్రహ్మయ్య

రాజంపేట : నియోజకవర్గంలో బలిజ సామాజికవర్గానికి చెందిన మాజీమంత్రి పసుపులేటి పసుపులేటి బ్రహ్మయ్య గోడు ఆ పార్టీకి తగలక తప్పదా? అవుననే అంటున్నారు ఆ పార్టీ కరుడుగట్టిన తెలుగుతమ్ముళ్లు.. పార్టీకి కష్ట కాలాల్లో నియోజకవర్గ పార్టీకి వాచ్‌మెన్‌గా కాపాలా ఉండి కాపాడుకుంటూ వచ్చిన బ్రహ్మయ్యకు చివరికి ఆ పార్టీ చావును కట్టబెట్టిందనే మనోవేదన ఆ పార్టీ తమ్ముళ్లలో నేటి భావన. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఉన్న హయాంలో క్యాబినెట్‌లో సహాయ మంత్రిగా పనిచేశారు. తన శ్వాస ఆగినంతవరకు ఆ పార్టీలోనే ఉండాలనే ఉద్దేశంతో కొనసాగినప్పటికి, చంద్రబాబు మాత్రం ఏరుదాటిన తరువాత తెప్పతెగలేసే రకంలా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలతో బ్రహ్మయ్య రాజకీయంగా బలైయ్యారు. అదే మానసిక వ్యథతో చివరికి అనారోగ్యంతో ఆయన మృతి చెందారు.

బ్రహ్మయ్య చివరి దశలో..

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున ఒక వెలుగువెలిగిన బ్రహ్మయ్య చివరిదశలో రాజకీయంగా కృంగిపోయేలా ఆ పార్టీ వ్యవహరించిందని ఇప్పటికి ఆయన అభిమానులు భావిస్తుంటారు. దీంతో ఆయన వర్గానికి చెందిన చాలా మంది నాయకులు చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్లుగా వెళ్లిపోయారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలతో సానుకూలంగా ఉండే బ్రహ్మయ్య పట్ల టీడీపీ చిన్నచూపు చూసిందనే విమర్శలు ఇప్పటికీ ఆ పార్టీ కార్యకర్తల్లో వినిపిస్తున్నాయి. బ్రహ్మయ్య వర్గీయులుగా ఉన్న వారు అనేక మంది ఆపార్టీకి దూరంగా నేటికి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. రాజకీయంగా పసుపులేటిని చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని ఆ వర్గం నాయకులు బలంగా చెబుతున్నారు.

బ్రహ్మయ్యపై బాబు పాలిట్రిక్స్..

1994, 1999లో రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ తర్వాత రెండుసార్లు ఓటమిని చవిచూశారు. ఓటమి తప్పదని తెలిసినప్పటికీ చంద్రబాబు ఉపఎన్నికల్లో బ్రహ్మయ్యను బరిలోకి దింపి రాజకీయంగా బలి చేశారనే విమర్శలు పార్టీ వర్గాల్లో ఇప్పటికి వినిపిస్తున్నాయి. ఆ నాటి నుంచి బ్రహ్మయ్యను వివక్షతో చంద్రబాబు చూస్తూ రావడం వల్ల రాజకీయంగా వెనుక బెంచికి వెళ్లిపోయే పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు.

యువగళంకు దూరంగా బ్రహ్మయ్య తనయులు..

బ్రహ్మయ్య మరణాంతరం ఆయన తనయులను చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదు. ట్రిమ్లీ పాలిట్రిక్స్ చేసే చంద్రబాబు మరోసారి తన నైజాన్ని బ్రహ్మయ్య తనయుల విషయంలో చూపడం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. పసుపులేటి వీరప్రదీప్‌కుమార్, పసుపులేటి వీరపవన్‌కుమార్‌లు పార్టీకి దూరంగా ఉంటున్నారు. తండ్రి చనిపోయిన తర్వాత పరామర్శకు వచ్చిన చంద్రబాబు పార్టీలో మంచి భవిష్యత్తు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ తరువాత కన్నెత్తి చూడలేదు. దీంతో ఆయన వారసులు ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు.

ఘనంగా కొరముట్ల పుట్టినరోజు వేడుకలు



ఓబులవారిపల్లె: ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న గల్లా శ్రీనివాసులు



పారిశుధ్య కార్మికులకు చీరలు పంచుతున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు/రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. పట్టణంలో బైక్ ర్యాలీ జరిపారు. అనంతరం వెయ్యి మందికి అన్నదానం చేశారు. పారిశుధ్య కార్మికులందరికి బట్టలు, చీరలు పంపిణీ చేశారు. మరో కార్యక్రమంలో సీహెచ్‌సీలో హెడ్‌డీఎస్ డైరెక్టర్ అంబటి హరికిషోర్ ఆధ్వర్యంలో కొరముట్ల పుట్టినరోజు వేడుకలో కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు, బ్రెడ్‌లు, జ్యూస్‌లు అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ముప్పాల హేమనవర్మ, మందల నాగేంద్ర, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సీడీ నాగేంద్ర, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, జెట్పీటీసీ రత్నమ్మ, సీహెచ్.రమేష్, గునిశెట్టి రమేష్, సుధాకర్‌రాజు, అంబటి మురళి, బండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

గల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో..

ఓబులవారిపల్లె : ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ మంగంపేట కాపు నాయకులు గల్లా శ్రీనివాసులు చిన్నఓరంపాడు ఎస్టీ కాలనీలోని పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాళ్లచెరువుపల్లె జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గల్లా శేఖర్, సర్పంచ్‌లు జరుగు నారాయణ రెడ్డి, పోలి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అవగాహన కార్యక్రమం



ప్రవేశ పరీక్షలపై సూచనలు చేస్తున్న దిలీప్‌కుమార్

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఈ నెల 11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ దిలీప్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పరీక్షలు ఏ విధంగా రాయాలి, బబ్లింగ్ ఎలా చేయాలి, ఓఎంఆర్ షీట్‌ను ఎలా నింపాలనే అంశంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9న పెనగలూరులో..

పెనగలూరు : మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఈనెల 11న ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాయబోయే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. 9వ తేది ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసే విద్యార్థులు హాజరుకావాలన్నారు. ప్రవేశ పరీక్ష రాసే విధానంపై ఉపాధ్యాయులచే అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు. కావున దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మోడల్ స్కూల్‌లో 9వ తేదీ హాజరుకావాలని కోరారు.

6న లక్కిరెడ్డిపల్లెలో అవగాహన కార్యక్రమం

లక్కిరెడ్డిపల్లె : ఈనెల 11న ఆదర్శ పాఠశాల లక్కిరెడ్డిపల్లిలో జరుగబోయే ఆరవ తరగతి ఎంట్రెన్స్ పరీక్షపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షా పత్రం నిర్మాణం, ఏయే సబ్జెక్టులలో ఎన్ని ప్రశ్నలు వస్తాయి, ఓఎంఆర్ షీటు, బబ్లింగ్‌పై పిల్లలకు అవగాహన కల్పిస్తామన్నారు. 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే విద్యార్థులు చేరుకోవాలని, పరీక్షకు వచ్చే విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, పరీక్షా ప్యాడ్‌తో పంపించేలా తల్లిదండ్రులు గుర్తించుకోవాలని సూచించారు.

నల్లపరెడ్డిపల్లెకు నేడు ప్రభుత్వ విప్ రాక

పెనగలూరు : మండలంలోని నల్లపరెడ్డిపల్లి గ్రామంలో 37 సంవత్సరాలు తరువాత గంగమ్మ జాతర జరుగనుండటంతో పలువురు ప్రముఖులు రానున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు తిరుపాల్ రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, కోడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ధ్వజారెడ్డిలతోపాటు పలువురు హాజరుకానున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి కలశారాధన

రామసముద్రం : రామసముద్రం మండలం కుదురుచీమనపల్లె పంచాయతీ మిట్టయంబాడిలో నూతనంగా నిర్మించిన శ్రీరుక్మిణి సమేత గోపాలస్వామి ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా బుధవారం ఘనంగా కలశారాధన నిర్వహించారు. ఉదయం వేదపండితులచే వేదమంత్రోత్సరణలతో భగవత్ ప్రార్థన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యస్వపనం, మృత్తికాన్నపనం, అగ్నిప్రతిష్ఠ, మూర్తి హోమం, సకృత్పుర్ణాహుతి, దాన్యాదివాసం నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం మూర్తిహోమం, జీవాదతత్వన్యాస హోమం, షోడశ న్యాసహోమం, సకృత్పూర్ణాహుతి, శయ్యాదివాసం, పుష్పాదివాసం చేశారు. అలాగే 8వ తేదీ గణపతిపూజ, పుణ్యాహవాచనం, కళశారాధన, ప్రాణాధి దశ వాయున్యాసహోమం, ప్రాణప్రతిష్ఠహోమం, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, కళ్యాణోత్సవం, తీర్థ ప్రసాద వినియోగము జరుగుతుందన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహులు చిన్నప్పరెడ్డి పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిద్దవటం జెడ్పీ హైస్కూల్ 1984-85 బ్యాచ్ విద్యార్థులు

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984 – 85 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడి పాఠశాల ప్రారంభమై 75 సంవత్సరాలు కావడంతో అమృత మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. 75 మొక్కలను నాటారు. అంతేగాకుండా అశోకుడి ధర్మచక్రాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్దవటం రేంజర్ ప్రసాద్ మాట్లాడుతూ 39 సంవత్సరాల తరువాత అందరు విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు తమ మిత్రులను ఆప్యాయంగా పలకరిస్తూ, అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాసేపు వయసును మరిచి స్నేహితులతో ఆటాపాటలాడారు. ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు, స్థానిక సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మధుశేఖర్, 1984–85 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'తిరుపతిలో ఉన్న ధరకే కొనుగోలు చేయాలి'



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి తదితరులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మార్కెట్ యార్డులో మామిడి కాయలను వ్యాపారస్తులు రైతుల నుంచి తిరుపతిలో ఉన్న ధరకే కొనుగోలు చేయాలని బుధవారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. రైల్వేకోడూరులో మామిడి కాయలకు సరైన ధర లభించడం లేదని ఇప్పటికే నష్టపోయిన రైతులకు సప్లయర్స్ సరైన ధర ఇవ్వకపోవడంతో మరింతగా నష్టపోతున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మామిడి కాయల సప్లయర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులకు సరైన ధరలు చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి మార్కెట్‌లో మామిడి కాయలకు ఏ ధర ఉంటే కోడూరులో అదే ధర చెల్లించాలని ఆదేశించారు. రైతులకు ఎవరైనా తక్కువ ధరలు చెల్లిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎఫ్.అహ్మద్‌ఖాన్, జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రరాజు, ఏడీ త్యాగరాజు, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్‌రాజు, సప్లయర్స్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : మద్యం మత్తులో కాలువలో పడి మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. కుమారపురంకు చెందిన శేఖర్(30) మదనపల్లె మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం మద్యం సేవించి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలోని శివాలయం సమీపంలో అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మురుగుకాలువలో పడ్డాడు. కాలువ లోతుగా ఉండటంతో శేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం



క్రీడాకారులకు మెడల్స్ అందిస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : ఆత్మరక్షణకు తైక్వాండో క్రీడ ఎంతగానో దోహదపడుతుందని ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ముక్కవారిపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో తైక్వాండోలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఎస్‌వీకే తైక్వాండో సమ్మర్ క్యాంపును నిర్వహించారు. విద్యార్థులు తమ స్థాయికి తగ్గట్టుగా బ్లాక్, రెడ్, బ్లూ, గ్రీన్, ఎల్లో బెల్టులలో తమ ప్రతిభను చాటారు. అనంతరం ముక్కా రూపానందరెడ్డి వారికి పత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, తల్లెం చంద్రమోహన్ రెడ్డి, తల్లెం విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, కోచ్ మాస్టర్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ చార్జీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలను మోపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అఫ్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపలో సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన తూముకుంట గ్రామంలో మండల, గ్రామ నాయకులు, అధికారులతో కలిసి బుధవారం గడప గడపకు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికి జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. గడప గడపకు వెళ్తుంటే మహిళలు ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలియజేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. టీడీపీ హయాంలో బడుగు, బలహీన వర్గాల వారిని విస్మరించారన్నారు. జగనన్న వారిని అక్కున చేర్చుకొని పెద్దపీట వేశారన్నారు.

ప్రతి గ్రామానికి మంచినీటిని అందిస్తాం

వైఎస్సార్ వెలిగల్లు నీటి పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిని ఏర్పాటు చేస్తామని, మండలంలోని తూముకుంట గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో రూ.4.30 కోట్లతో పేర్యంపల్లె, గుండ్లచెరువు, నూలివీడు, వెలిగల్లు, తూముకుంట గ్రామాలలో మంచి నీటి పథకం పూర్తయ్యిందన్నారు. దీంతో ప్రజలు శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, మైనార్టీ నాయకులు బాబా ఫకృద్దీన్, ఎంపీటీసీలు షాన్‌వాజ్, చిన్నరెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్ ఆంజనేయులురెడ్డి, రమణారెడ్డి, మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ రమణారెడ్డి, ధర్మారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఇరగంరెడ్డి, నాగశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర గృహాన్ని సందర్శించిన జడ్జి

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని బుధవారం డిఎల్ఎస్ఏ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత తమ సిబ్బందితో సందర్శించారు. అక్కడి పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015 వివరించారు. న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ (ఎల్‌ఏడిసిఎస్), ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు.

అతిసార నివారణపై అవగాహన

తంబళ్లపల్లె: వేసవిలో అతిసార పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీహెచ్‌ఈవో రమణ తెలిపారు. బుధవారం బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ అక్కెమ్మగారిపల్లెలో అతిసార నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిసార బారినపడకుండా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీలోని కట్టకిందపల్లి (జెడ్పీ చైర్మన్ ఆకేపాటి స్వగ్రామం)లో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. పురోహితులు ముందుగా బుధవారం మినరల్ వాటర్ ప్లాంట్‌కు పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి మురళీరెడ్డితో కలిసి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి గ్రామ ప్రజలు వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, జంగంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, రెడ్డయ్యరెడ్డి, కౌన్సిలర్ ఆర్.రాఘవేంద్రవర్మ, ఎ.మధు యాదవ్, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేటు ఫీజు దోపిడీని అరికట్టండి



మాట్లాడుతున్న లవకుమార్

రాయచోటి అర్బన్ : కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు దోపిడీని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని ఏఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏఐఎస్ఏ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. జీఓ నం.142లను ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేసి ఫీజు దోపిడీని అరికట్టాలంటూ ఆయన డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టడీ మెటీరియల్ తదితరాలను వేలాది రూపాయలకు విద్యార్థులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారంటూ ఆయన మండిపడ్డారు. సమావేశంలో ఆయనతో పాటు ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏరియా నాయకుడు హరిప్రసాద్‌లు పాల్గొన్నారు.

మద్యం షాపుల సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు



మద్యం షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పీలేరు : మద్యం షాపుల సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు చేయరాదని చిత్తూరు మద్యం డిపో ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు చేశారని, తీరా తాము పూర్తి స్థాయిలో విచారణ జరపగా తప్పుడు ఫిర్యాదులు అని తేలాయని పేర్కొన్నారు. సిబ్బంది తమపై ఫిర్యాదులు రాకుండా మద్యం ప్రియులపై మర్యాదగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో తనిఖీ అధికారులు నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : బడిఈడు పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలని కార్మికశాఖ అధికారి ఆనందబాబు అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్టలో వివిధ దుకాణాలకు వద్దకు వెళ్లి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. చదువుకునే వయస్సులో పిల్లలు బడిలో మాత్రమే ఉండాలన్నారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శాంత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై అవగాహన

మదనపల్లెల సిటీ : ఫోర్డు, క్రై సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి 12 వరకు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మదనపల్లె, పెద్దమండ్యం మండలాల్లో గ్రామ, కాలనీల్లో ర్యాలీలు, చిత్రలేఖన పోటీలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల కార్మికులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత గురించి వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీధర్, నరసింహులు, రాధమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన 'ధుర్యోదన వధ' నాటకం



ధుర్యోదన వధ నాటకంలో ఆకట్టుకున్న సన్నివేశ దృశ్యం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు బుధవారం ధుర్యోధన వధ నాటకంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, తదుపరి భాగవతారిణి స్వర్ణలత హరికథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ధుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న ధుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహుతులను అలరించింది. మైదానంలో ఏర్పాటు చేసిన ధుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టిపడేసింది.